www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

శుక్రవారం | 14 | ఆగస్టు | 2026 | పేజీలు: 08




## భవిత కేంద్రాలతో నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యత

కలెక్టర్ చిత్రా మిశ్రా

2



# పేదింటి ఆత్మ గౌరవం.. ఇల్లు

**అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులో పూర్తి చేయాలి**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**క్షేత్రస్థాయిలో పనుల పురోగతి సంతృప్తికరంగా లేదు**

**ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించాలి**

**కాంట్రాక్టర్లు, అధికారులు పనుల్లో జాప్యం చేస్తే తగు చర్యలు**

**అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేయాలి**

**రోళ్లవాగు షట్టర్ పనులు ఆగస్టు నెలాఖరులోగా... అక్కేపల్లి లిఫ్ట్ పనులు జనవరి 2027 నాటికి పూర్తి చేయాలి**

**ప్రతి గుడిసెకు ఇల్లు... అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు అందించాలి**

**ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష**

**జగిత్యాల, అక్షిత బ్యూరో :** ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పురోగతి ఏమాత్రం సంతృప్తికరంగా లేదని, ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించుకుని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులను అనవసరంగా జాప్యం చేయవద్దని, కాంట్రాక్టర్లు సహకరించకపోతే వెంటనే చర్యలు తీసుకుని అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేయాలని స్పష్టం చేశారు. మంజూరైన అన్ని పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని, రానున్న రోజుల్లో అభివృద్ధి పనుల్లో స్పష్టమైన మార్పు ప్రజలకు కనిపించాలని అన్నారు. సబ్ ప్లాన్ నిధులతో చేపట్టే రూ.5 లక్షల వరకు ఉన్న పనులను ఆలస్యం చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో వెంటనే ప్రారంభించాలని సూచించారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ధర్మపురి పట్టణంలో చేపట్టాల్సిన ..మిగతా 2లో

# సురక్షిత నీటితో ప్రజారోగ్యం

**బుగ్గపల్లిలోని 75 ఎంఎల్‌డీ మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్ పరిశీలన**

**క్షేత్రస్థాయిలోనూ నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలి**

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** పెద్దమందడి మండలం బుగ్గపల్లి వద్ద ఉన్న 75 ఎంఎల్‌డీ సామర్థ్యం గల మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొని మొక్కను నాటారు. అనంతరం మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకట రమణతో కలిసి నీటి శుద్ధి ప్లాంట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ప్లాంట్‌లో నీటి ప్రవాహం, ఫిల్టరేషన్ ప్రక్రియకు సంబంధించిన ఫ్లో డయాగ్రామ్‌ను కలెక్టర్ పరిశీలించారు. గౌరిదేవిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు ప్లాంట్‌కు ఏ విధంగా చేరుతుంది, ప్లాంట్‌కు చేరిన అనంతరం వివిధ దశల్లో నీటిని ఏ విధంగా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్లాంట్‌లోని నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాలను కలెక్టర్ సందర్శించారు. నీటి వడపోత (ఫిల్ట్రేషన్) ప్రక్రియ, నీటి నాణ్యతను పరీక్షించే విధానం, శుద్ధి చేసిన నీటి నాణ్యతను నిర్ధారించే పరీక్షలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ నుంచి ప్రజలకు సరఫరా చేసే సమయంలో ఉన్న నీటి నాణ్యత క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరే వరకు అదే స్థాయిలో కొనసాగుతుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించేందుకు క్షేత్రస్థాయిలో కూడా నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ..మిగతా 2లో

# మెరుగైన వైద్యం అందించాలి

**రోగులకు ఆరోగ్య పరీక్ష కేంద్రాలు**


**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో రోగులకు ఆరోగ్య పరీక్ష పరికరాల ద్వారా పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎన్ఐసి సమావేశ మందిరంలో స్క్రీనింగ్ పరికరాల వినియోగంపై ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులకు ..మిగతా 2లో

# జనగణనతో పల్లెల ప్రగతి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్, అక్షిత బ్యూరో:** జనగణన 2027 సన్నాహకాల్లో భాగంగా జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ అత్యంత ప్రామాణికమైనదని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఆర్డీవోలు, తాహసిల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ తయారీపై గూగుల్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. ప్రణాళికాబద్ధమైన భవిష్యత్తు అభివృద్ధికి జనాభా లెక్కలు దోహదం చేస్తాయన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి రంగం సమగ్ర సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన 2027 సన్నాహకాల్లో ..మిగతా 2లో

## మెరుగైన వైద్యం అందించాలి



మొదటి పేజీ తరువాయి...
నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్రతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఓమ్ని ఆక్టివ్ కేర్ ఫౌండేషన్ వారి సహకారంతో హెల్త్ ప్రాజెక్ట్ కాంట్రిబ్యూషన్ లో భాగంగా అందించిన హెల్త్ స్క్రీనింగ్ పరికరాలు, మల్టీ పారామెట్రిక్ డయాగ్నొస్టిక్ డివైస్ లను వినియోగించుకుని తమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చికిత్సల కోసం వచ్చే రోగులకు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరికరాలను అందించడం జరిగిందని, స్క్రీనింగ్ పరికరాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని, మారుమూల గ్రామాల ప్రజలకు ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆకాంక్షిత బ్లాక్ సమన్వయకర్త డా. బాలరాజు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## సురక్షిత నీటితో ప్రజారోగ్యం




మొదటి పేజీ తరువాయి...
ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, నీటి శుద్ధి ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ అంజద్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగణనతో పల్లెల ప్రగతి



మొదటి పేజీ తరువాయి...
మున్సిపల్, విద్య, వైద్య ఆరోగ్య, హౌసింగ్, ఆర్ అండ్ బీ వంటి వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాలు , పట్టణాల వారీగా జనాభా వివరాలు నమోదు చేయడం.మౌలిక వసతులు, విద్య, వైద్యం పౌర సౌకర్యాల సమాచారం సేకరించడం.డిజిటల్ యాప్‌లు లేదా వెబ్ పోర్టల్స్ ద్వారా ఖచ్చితమైన డేటాను క్రోడీకరించడం.

రెవెన్యూ గ్రామాల స్థాయిలో అధికారుల ద్వారా పర్యవేక్షణ జరపడం. చేయాలన్నారు. ఈ గూగుల్ మీట్ సమావేశం లో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ, బవయ్య, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదింటి ఆత్మగౌరవం.. ఇల్లు



మొదటి పేజీ తరువాయి...
పనులకు ముందుగానే ప్రణాళిక రూపొందించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోళ్ల వాగు షట్టర్ పనులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని, అక్కేపల్లి లిఫ్ట్ పనులను జనవరి 2027 నాటికి పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెండింగ్ బిల్లుల వివరాలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని, పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి తెలిపారు.ప్రాజెక్టులకు సంబంధించిన నిర్వహణ పనులను సీజన్ ప్రారంభానికి ముందే ప్రణాళికాబద్ధంగా చేపట్టి పూర్తి చేయాలని సూచించారు.

యశ్వంతరావు పేట, రంగధాంపల్లి చెరువుల పనులకు సంబంధించిన అంచనాలను త్వరగా ఆమోదించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, కన్నంపల్లి లింక్ కాలువకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ చెల్లింపులను త్వరలో పరిష్కరించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ధర్మపురిలో రూ.3.14 కోట్లతో అభివృద్ధి చేస్తున్న కోరండపల్లి చెరువు పనులు ప్రస్తుతం 35 శాతం పూర్తయ్యాయని, బండ్ ఏర్పాటు, స్టోన్ పిచింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పునరుద్ధరణ పనులను నిర్దేశ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి వచ్చే జూన్ 2027 నాటికి చెరువును నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వెంటనే ప్రారంభించి నిర్దేశ గడువులో పూర్తి చేయాలని సూచించారు. ధర్మపురిలో తొలి దశలో 2,756 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 2,462 ఇళ్లకు మార్కింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులను అధికారులు నిరంతరం సంప్రదించాలని, ఇల్లు నిర్మించేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన ఇతర లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధర్మపురిలో 617 ఇళ్ల పూర్తయ్యాయని, 1,295 ఇళ్లు ఫినిషింగ్ దశలో ఉన్నాయని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలపై కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలో ధర్మపురి ని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని, ప్రతి గుడిసెకు ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ.463 కోట్ల విలువైన 26 పనులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రూ.19 కోట్ల బిల్లులు చెల్లించగా, రూ.11 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. 10 పనులు పూర్తయ్యాయని, 12 పనులు పురోగతిలో ఉండగా, 2 పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు.పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించాలని, అవసరమైన చోట కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గత సంవత్సరం చేపట్టిన, ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.153 కోట్ల విలువైన 396 పనులు మంజూరు కాగా, రూ.31 కోట్ల విలువైన 96 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ.జీ.ఎస్, కింద రూ.18 కోట్ల విలువైన 296 పనులు మంజూరు కాగా ఇప్పటివరకు రూ.4.6 కోట్ల మేర ఖర్చు జరిగిందని, గ్రౌండింగ్ అయిన అన్ని పనులను నిర్దేశ గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ధర్మపురి పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.12.85 కోట్లతో 8 అభివృద్ధి పనులు చేపట్టగా 5 పనులు పూర్తయ్యాయని, మరో పని ఫినిషింగ్ దశలో ఉందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ టెండర్ దశలో ఉండగా, ప్రవేశ ద్వారాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు.ధర్మపురి పట్టణ తాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 కింద రూ.23 కోట్లతో చేపట్టిన పనుల్లో 22.2 కిలోమీటర్ల పైప్‌లైన్ లో 82 శాతం, 900 గృహ కనెక్షన్ల లో 77 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో మొత్తం 29 పనులకు రూ.234 కోట్ల విలువైన పనులు మంజూరు కాగా, ఇందులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలలు, మరమ్మతులు, భవిత కేంద్రాలకు సంబంధించిన 16 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి రాజ గౌడ్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంపిడిఓ లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భవిత కేంద్రాలతో నాణ్యమైన విద్య

### ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రతకు ప్రాధాన్యత

### కలెక్టర్ చిత్రా మిశ్రా





**కరీంనగర్, అక్షిత బ్యూరో :** ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధన్గర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రం, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. భవిత కేంద్రంలో గదులు కలియ తిరుగుతూ రిజిస్టర్ పరిశీలించారు. పిల్లలు, సిబ్బంది వివరాలు, చిన్నారులకు అందిస్తున్న ఫుడ్ వివరాలు, ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జిల్లాలో16 భవిత కేంద్రాల్లో తాగునీరు(వాటర్ డిస్పెన్సరీలు) ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సైతం యూనిఫామ్, పుస్తకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రంలో పేరెంట్స్ వెయిటింగ్ రూమ్, ప్రత్యేక వాష్ రూమ్, ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక ప్లేట్లు, గ్లాసులు అందించాలన్నారు.ప్రతి భవిత కేంద్రంలో సరిపడా సిబ్బంది(సమ్మిళిత విద్యా బోధకులు) ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి గదులు పరిశీలించి అందిస్తున్న సౌకర్యాలు తెలుసుకున్నారు.పాఠశాలలో వృధాగా ఫర్నిచర్, బెంచీలు ఉండటంపై అసహన వ్యక్తం చేశారు. ఏర్పాట్లు చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిరుపయోగంగా ఉన్న ఫర్నిచర్, బెంచీలను అవసరమైన పాఠశాలలకు తరలించాలని ఆదేశించారు. పిల్లలు కింద కూర్చోకుండా విధిగా బెంచీలు ఏర్పాటు చేయాలన్నారు. స్క్రాప్ ను తొలగించి పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఉన్న వనరులను వృధాగా ఉంచకుండా వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.

"అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన"

ఆ తర్వాత డాక్టర్ స్ట్రీట్ లో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. స్కూల్ భవనం శిథిలావస్థకు చేరినందున మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అప్పటివరకు తాత్కాలికంగా ముకరంపురలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్లోకి ఈ స్కూల్ ను తరలించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హై స్కూల్ తరగతి గదులు శిథిలావస్థకు చేరినందున తొలగించి.. పెద్ద భవనం నిర్మించాలన్నారు. భవనం చుట్టూ ప్రహరీ, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మార్ట్ సిటీ కింద ఏ పాఠశాలల్లో ఎన్ని నిధులు ఖర్చు చేశారో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

**లేఅవుట్లలో రోడ్ల విస్తీర్ణం, హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

**మున్సిపల్ కమిషనర్‌కు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశాలు**





**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ప్లాట్ల లేఅవుట్లపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ సందర్శించారు. పట్టణ విస్తరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో ప్రైవేటు లేఅవుట్లు ,పట్టణాభివృద్ధి క్రమబద్ధంగా సాగేందుకు, ప్రజలకు భవిష్యత్తులో రహదారులు, మౌలిక సదుపాయాల విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కలెక్టర్ ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎదురుగా, జిల్లా ఎస్పీ ఎదురుగా, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైవేటు లేఅవుట్లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, లేఅవుట్ల ఏర్పాటు ప్రభుత్వ నిబంధనలు, మున్సిపల్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా లేదా అనే అంశాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

లేఅవుట్లలో ప్లాట్ల విభజన, రహదారుల ఏర్పాటు, రోడ్లకు కేటాయించిన స్థలం, లేఅవుట్ హద్దులు, ఇతర మౌలిక సదుపాయాలకు కేటాయించిన ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. లేఅవుట్ అభివృద్ధి సమయంలో నిబంధనలకు అనుగుణంగా స్థలాలను కేటాయించారా, రహదారుల విస్తీర్ణం నిర్ణీత ప్రమాణాల మేరకు ఉందా, లేఅవుట్ హద్దులు సక్రమంగా నిర్ధారించారా అనే విషయాలపై లేఅవుట్ ల పరిశీలించి అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు లేఅవుట్ల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకే జరగాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా లేఅవుట్లలో రహదారులు, ప్రజా అవసరాలకు కేటాయించే స్థలాలు, ఇతర మౌలిక సదుపాయాల కోసం నిర్దేశించిన ప్రదేశాలను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత నిర్వాహకులపై ఉందన్నారు.

ప్రైవేటు లేఅవుట్ల విషయంలో మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు చేయకుండా ముందస్తు పర్యవేక్షణ చేపట్టాలని, ఇప్పటికే ఏర్పాటు చేసిన లేఅవుట్లను కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు.

లేఅవుట్లలో రహదారుల విస్తీర్ణం అత్యంత కీలకమైన అంశమని, భవిష్యత్తులో జనాభా పెరుగుదల, వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రహదారుల వెడల్పు, హద్దులు నిబంధనల మేరకు ఉండేలా చూడాలని, రహదారులకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా లేఅవుట్ల హద్దులు స్పష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు, రహదారులు లేదా ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. లేఅవుట్లను అనుమతించే సమయంలోనే అన్ని నిబంధనలను కచ్చితంగా పరిశీలించాలని, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, లేఅవుట్లకు సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలుపై అధికారులు స్పష్టమైన పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు.

మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళికకు అనుగుణంగా అభివృద్ధి జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్ల విషయంలో ఎలాంటి అవకతవకలకు, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.

ప్రైవేటు లేఅవుట్లను క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులను గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. లేఅవుట్లకు సంబంధించిన రికార్డులు, అనుమతులు, స్థల వివరాలను పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు లేఅవుట్లకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నిరసన

**విద్యార్థుల పోలీసుల మధ్య స్వల్ప తోపులాట**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల: విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో బాగంగా గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల 8 వందల 14 కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, హాస్టల్ సౌకర్యాలు కల్పించాలని, విద్యాసంస్థల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం పరిస్థితిని పోలీసులు అదుపులోకి తీసుకు వచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.

## దాతృత్వం చాటుకున్న బోరం ప్రకాశ్ రెడ్డి

**తూర్పు గూడెం, మందోళ్ల గూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూలు షూ లు అందజేత**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** మందోల్ల గూడెం మాజీ ఉప సర్పంచ్ బీఆర్ఎస్ నాయకులు బోరం ప్రకాశ్ రెడ్డి చౌటుప్పల్ మండల పరిధిలోని తూర్పుగూడెం, మందోళ్ల గూడెం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించి ఆయా పాఠశాలలో చదువుతున్న 36 మంది విద్యార్థులకు షూలు అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నేటి చిన్నారులే రేపు భావి భారత పౌరులు గా ఎదుగుతారని, క్రమశిక్షణతో కష్టపడి బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించే విధంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రోత్సహించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్ పరమేష్,జీ వరలక్ష్మి లు బోరం ప్రకాష్ రెడ్డిని ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తూర్పుగూడెం ఏఎంసీ చైర్మన్ పిట్టల సంతోష , ఏడో వార్డు మెంబర్ మానే రవి కుమార్, 8వ వార్డ్ మెంబర్ గుండు శ్రీశైలం, తూర్పుగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. పరమేష్ , ఉపాధ్యాయురాలు జి. వరలక్ష్మి ,మందోల్లగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ సంధ్య , గ్రామ టిఆర్ఎస్ యువకులు గుండు ప్రశాంత్ , నిలిగొండ రఘు పాల్గొన్నారు.

### ఘనంగా తిమ్మాపూర్ ఖండ

## శతాబ్ది ఉత్సవాల యువ సమ్మేళనం

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తపల్లిలోని సాయిరాం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన యువసమ్మేళనం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ప్రధాన వక్తలుగా హాజరైన ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భాను చందర్ జి , తడగొప్పుల శంకరయ్య జి లు మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాదన్నారు. యువత క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు యువతకు ఉందని, ఇటీవల జెన్-జీ చెపట్టిన ఆందోళనలు దేశ వ్యతిరేకం కాదని, ఆ ముసుగులో దేశ వ్యతిరేక శక్తులు చొరబడి అలజడులు సృష్టించి దేశాన్ని దెబ్బ తీసే ప్రయత్నం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఆందోళనలు, నిరసనలు సంభాషణకు ఒక మార్గమని, అయితే అవి ప్రజాస్వామ్య నిబంధనల పరిధిలోనే జరగాలని కానీ, దేశ వ్యతిరేక శక్తులు ఇలాంటి విషయాల్లో తల దూర్చితే అనేక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని , అందుకే యువత జాగ్రత్తతో వ్యవహరించాలని వక్తలు సూచించారు. ముఖ్యంగా దేశాభివృద్ధిలో, సామాజిక మార్పులో యువత క్రమశిక్షణ, దేశభక్తితో ముందుండి దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని వారు ఆకాంక్షించారు. యువత దేశం పట్ల అంకితభావం, మన సంస్కృతి, సంప్రదాయాలు,చారిత్రక గొప్పతనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవలం విద్యనే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, కష్టకాలంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే నాయకత్వ గుణాలను పెంపొందించుకోవాలని సూచించారు.కుల, మత, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి సమాజమంతా ఒక్కటే అనే భావన ను యువత కలిగి ఉండాలన్నారు.యోగా, వ్యాయామాలు, బౌద్ధిక చర్చలు ను యువత నిత్యజీవితంలో అలవాటుగా మార్చుకోవాలన్నారు.



పర్యావరణ పరిరక్షణ (మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ), రక్తదాన శిబిరాలు సామాజిక సేవా కార్యక్రమాలలో యువత క్రియాశీలకంగా ఉండాలన్నారు.. ప్రధానంగా ఈ సమ్మేళనాలు యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, దేశ నిర్మాణాత్మక కార్యక్రమాలలో భాగస్వామ్యులుగా చేయాలనే సంకల్పంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రోగ్రాం లో ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్ , సహకార్యవాహ మురళి , రమణ, కన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య

**మెరుగైన వసతులు అందేలా చర్యలు తీసుకోవాలి**

**మైనారిటీ గురుకుల కళాశాలలో వసతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** కొత్తకోట మండలం అమడబాకులలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా బోధన, నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ముందుగా కళాశాలలోని స్టాక్ రూమ్‌ను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న నిత్యావసర సరుకుల నాణ్యత, నిల్వలు, సరఫరా వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, సరుకులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి నిర్వహించాలని సూచించారు. అనంతరం కళాశాలలోని భోజనశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడి పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చూడాలని, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తదుపరి విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడి కళాశాలలో అందుతున్న విద్య, వసతులు, భోజనం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేలా స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కళాశాలలో నెలకొన్న విద్యుత్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, విద్యార్థుల సౌకర్యార్థం ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, విద్యుత్ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి ఆరోగ్యం, భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ డి ఎస్ సి కార్పొరేషన్ సిరాజుద్దీన్, ఇతర అధికారులు తదితరులు, కలెక్టర్ వెంట ఉన్నారు.

## కాజీపేట సోమిడిలో ఎమ్మెల్యే నాయిని పరామర్శ..

**కాంగ్రెస్ నాయకుడు లింగారెడ్డిని, మాతృవియోగం పొందిన యాదగిరిని పరామర్శించిన ఎమ్మెల్యే నాయిని**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గురువారం కాజీపేట 62వ డివిజన్‌లోని సోమిడిలో పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కాంగ్రెస్ నాయకులు లింగారెడ్డిని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సోమిడి గౌడ సంఘం అధ్యక్షులు యాదగిరి తల్లి కౌసల్య ఇటీవల పరమపదించగా, దశదిన కర్మకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట తాజా మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్, సుంచు అశోక్, గుంటి కుమార్, 62 వ డివిజన్ అధ్యక్షులు పాలడుగుల ఆంజనేయులు, భద్రకాళి దేవస్థానం ధర్మకర్త పాలడుగుల ఆంజనేయులు,ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థ 23వ డివిజన్ సీతారాంపూర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ అక్షిత న్యూస్:** కొత్తపల్లి 17, 18 డివిజన్లలో అమృత్ 2.0 నిధులతో బ్లాక్ ప్లాంటేషన్ ఫెన్సింగ్ పనులకు శ్రీకారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 23వ డివిజన్ సీతారాంపూర్ ప్రాంతంలో సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సీతారాంపూర్ ప్రాంతంలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగి, మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

అనంతరం 17, 18 డివిజన్లకు సంబంధించిన అమృత్ 2.0 నిధులతో చేపట్టనున్న బ్లాక్ ప్లాంటేషన్ ఫెన్సింగ్ పనులను మేయర్ ప్రారంభించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా చేపట్టుతున్న ఈ పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉంటాయని ఆయన అన్నారు. మొక్కల సంరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా వాటి పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ గుమ్మడి రాజకుమార్ , 17, 18వ డివిజన్ కార్పొరేటర్లు వేముల కవిత చంద్రశేఖర్ వాసాల రమేష్ , మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, డివిజన్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్ల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోండి

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి**

**వికారాబాద్ 16వ వార్డు గంగారం కౌన్సిలర్ మున్నూరు పుష్పలత శ్రీకాంత్**



**వికారాబాద్, అక్షిత బ్యూరో :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తోందని 16వ వార్డు గంగారం కౌన్సిలర్ మున్నూరు పుష్పలత శ్రీకాంత్ తెలిపారు. ముఖ్యంగా పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవాలనే లక్ష్యంతో చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కొత్త పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు.

16వ వార్డు గంగారం లో ఇప్పటివరకు కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోని అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే ఆలస్యం చేయకుండా తమ వివరాలను సమర్పించాలని కౌన్సిలర్ మున్నూరు పుష్పలత శ్రీకాంత్ కోరారు. అర్హులైన వారు అవసరమైన వివరాలు, సంబంధిత పత్రాలతో తనను సంప్రదించడంతో పాటు వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కూడా దరఖాస్తు వివరాలను సమర్పించవచ్చని సూచించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ, దరఖాస్తు ప్రక్రియలో సహకరిస్తామని తెలిపారు. పింఛన్ కోసం అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ బీజేపీ నార్త్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో" నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. దేశభక్తి భావాన్ని ప్రజల్లో మరింత బలోపేతం చేయడం, ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల నుండి ప్రారంభమై కోర్టు సర్కిల్‌లోని "అంబేద్కర్ చౌక్" వరకు కొనసాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొని జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ముందుకు సాగారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఉన్న వారందరూ కలిసి "జాతీయ గీతం ఆలపించి" దేశానికి తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశ ఐక్యత, సమగ్రత, దేశభక్తి భావనకు ప్రతీక అని అన్నారు. ప్రతి పౌరుడు జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ బండ రమణారెడ్డి, బీజేపీ నార్త్ జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్, నాయకులు మహేష్, నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 80వ స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు..

**జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలి**

**ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి లోటుపాట్లకు తావివ్వొద్దు**

**అధికారులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశం**

**ఎస్పీతో కలిసి పెరేడ్ మైదానంలో ఏర్పాట్ల పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**





**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు.

ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్న పెరేడ్ మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖల అధికారులు చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన వేదిక నిర్మాణం, ముఖ్యఅతిథి జాతీయ పతాకావిష్కరణ చేసే ప్రాంతం, పోలీస్ పరేడ్ నిర్వహణ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రదర్శన కోసం ఏర్పాటు చేయనున్న స్టాళ్లు తదితర అంశాల ఏర్పాటు పై అధికారులతో అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ......, 80వ స్వాతంత్ర్య దినోత్సవం దేశ ప్రజలందరికీ అత్యంత ప్రాముఖ్యత కలిగిన జాతీయ పండుగ అని, జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు, అధికారులు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

పెరేడ్ మైదానంలో ముఖ్యఅతిథి జాతీయ పతాకావిష్కరణ చేసే ప్రదేశాన్ని ప్రత్యేకంగా పరిశీలించిన, కార్యక్రమం సజావుగా సాగేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, వేదికపై ప్రముఖులు, అధికారులు కూర్చునే విధానం, ఆహ్వానితులకు సీటింగ్ ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా ఏర్పాట్లు చేయాలని, విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, కార్యక్రమాల నిర్వహణలో సమయపాలన పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వివిధ పాఠశాలలు, విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించి అవసరమైన రిహార్సల్స్, వేదిక ఏర్పాట్లు, విద్యార్థుల కూర్చునే ప్రదేశాలు తదితర అంశాలను సమన్వయంతో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించే విధంగా శాఖల వారీగా ఏర్పాటు చేయనున్న స్టాళ్లపై కూడా కలెక్టర్ ఆరా తీశారు.

ఆయా శాఖలు తమ పథకాలు, కార్యక్రమాల వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించాలని ,ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను స్టాళ్లలో ఆకర్షణీయంగా ప్రదర్శించాలని, స్టాళ్ల ఏర్పాటులో సమన్వయం పాటిస్తూ మైదానంలో సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ పెరేడ్ మైదానంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, అధికారులు, ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు.

పోలీస్ పరేడ్ నిర్వహణ, పోలీసు సిబ్బంది విధులు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, ప్రజల కదలికలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ తరఫున అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

జిల్లా కలెక్టర్, ఎస్పీ వెంట అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ ఆర్డిఓ అర్చన,సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబటిపల్లి పి.హెచ్.సి ఆధ్వర్యంలో దత్తారం గ్రామంలో హెల్త్ క్యాంప్

**వైద్యాధికారి డాక్టర్ జయచంద్ర యాదవ్**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** లింగాల మండల పరిధిలోని దత్తారం గ్రామంలో అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది ఇట్టి క్యాంప్ లో దాదాపు 70 మంది ఓపి రిజిస్ట్రేషన్ కావడం జరిగింది .వైరల్ ఫీవర్ అండ్ టైఫాయిడ్ మలేరియా లాంటి కేసులు రాకుండా ముందు జాగ్రత్త తీసుకోవాలని అంబటిపల్లి పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ జయచంద్ర యాదవ్ సూచించారు. ప్రతి ఒక్కరు కూడా ఇంటి పరిసరాలలో శుభ్రంగా ఉంచుకోవాలని వేడి చేసిన నీళ్లను త్రాగాలని దోమలు ఈగలు వాలకుంట ఆహార పదార్థాలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల చిన్న పార్టీ వర్షాలకు గడ్డి వేపుగా పెరిగి దోమలు వ్యాపిస్తున్నాయని వాటి నివారణకు గడ్డి మందు పిచికారి చేయాలని సూచించారు. గ్రామంలో అత్యవసర సమయంలో వైద్య అధికారులు సంప్రదించాలని సలహాలు సూచనలు తీసుకొని ప్రభుత్వం ద్వారా వచ్చిన ఉచిత మందులు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబిబిఎస్ సివిల్ సర్జన్ మరియు డాక్టర్ రవి కుమార్ నాయక్ ఎంహెచ్ఎన్ జిల్లా వైద్యాధికారి అండ్ డిస్టిక్ ఆఫీసర్ మరియు సిబ్బంది రామచందర్ హెల్త్ అసిస్టెంట్ ల్యాబ్ టెక్నీషియన్ ఆతిరాం రామకృష్ణ వైద్య సిబ్బంది ఆశా వర్కర్స్ ఉమాలక్ష్మి చంద్రకళ రామకృష్ణ ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారీ బైక్ ర్యాలీ



**అలంపూర్ : అక్షిత న్యూస్ ఆగస్టు 13:** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అయిజ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీగా తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ అయిజ పట్టణ అధ్యక్షులు నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాలు, ఎంపీ డీకే అరుణమ్మ సూచనల మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా అయిజ పట్టణ పురవీధుల్లో తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేయడం విశేషమన్నారు. భారతదేశ ఆత్మను ఐక్యంగా నిలిపే దేశభక్తి స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరికీ ప్రేరణనిస్తుందని అన్నారు. త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడాలని, భారత్ ప్రగతి పథంలో నిరంతరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండాతో సెల్ఫీ తీసుకుని 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భగత్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, అంజి, నాగరాజు, రాజశేఖర్, భీమన్న, ప్రతీప్, సి. నరసింహ, రఘు, వెంకటేష్, నాగిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్
# పెండింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

**కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో గురువారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితిని వివరించారు.

వరంగల్, పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సీజీహెచ్ఎస్ వైద్య సేవలపై ఆధారపడుతున్నారని ఎంపీ వివరించారు. వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవల కోసం 350 కి.మీ.కు పైగా దూరం ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, తరచూ వైద్య సేవలు అవసరమైన పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ఉందని ఎంపీ తెలిపారు. భవనానికి సంబంధించిన ఫెయిర్ రెంట్ అసెస్‌మెంట్ ఇప్పటికే పూర్తయిందని, అద్దె ఫైల్‌కు ఆల్ ఇండియా రేడియో సీఈఓ ఆమోదం కూడా లభించిందని వివరించారు.

పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేసి, మిగిలిన అధికారిక ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ విజ్ఞప్తి చేశారు.

www.aakshitha.com People's voice
AKSHITHA NATIONAL DAILY



## యశోద హాస్పిటల్‌లో 14 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్రచికిత్స

### మృత్యువు అంచుల నుంచి బాలుడిని కాపాడి ప్రాణం పోసిన యశోదా వైద్యులు

### డాక్టర్ శ్రీనివాస్ బోట్ల



**కోదాడ అక్షిత ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో తలకు గాయమైనప్పుడు బయటకు గాయం కనిపించకపోయినా నిర్లక్ష్యం చేయొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పుర్రె లోపల రక్తస్రావం జరిగి మెదడుపై ఒత్తిడి పెరిగితే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన 14 ఏళ్ల మల్లెబోయిన తేజ దురాజ్‌పల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయాడు. మూర్ఛ రావడంతో మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా.. పరీక్షల్లో పుర్రె లోపల భారీగా రక్తం పేరుకుపోయి మెదడుపై తీవ్ర ఒత్తిడి ఏర్పడినట్లు వైద్యులు గుర్తించారు. మెదడు సహజ స్థానంలో నుంచి పక్కకు జరిగినట్లు నిర్ధారించారు. పక్కటెముక విరగడంతో ఊపిరితిత్తి చుట్టూ గాలి చేరినట్లు గుర్తించారు. డా. శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలోని వైద్యబృందం అత్యవసరంగా క్రానియోటమీ చేసి మెదడుపై ఒత్తిడి కలిగిస్తున్న రక్తాన్ని తొలగించింది. దెబ్బతిన్న పుర్రె ఎముకను టైటానియం ప్లేట్లు, స్క్రూలతో పునర్నిర్మించారు. ఊపిరితిత్తి సమస్యకు చికిత్సతో పాటు శ్వాసమార్గ నిర్వహణ కోసం ట్రాకియోస్టమీ చేశారు. న్యూరోసర్జరీ, క్రిటికల్ కేర్, కార్డియో థొరాసిక్, పీడియాట్రిక్స్ విభాగాల వైద్యులు సమన్వయంతో చికిత్స అందించి బాలుడి ప్రాణాలను కాపాడారు.

**యాక్సిడెంట్ జరిగిన పేషెంట్కు ప్రతి నిమిషం కీలకం**

ప్రమాదం తర్వాత స్పృహ కోల్పోవడం, మూర్ఛ, అసాధారణ మగత, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తరలించాలని డా. శ్రీనివాస్ బొట్ల సూచించారు. సకాలంలో పరీక్షలు, అత్యవసర న్యూరోసర్జరీ అందితే శాశ్వత మెదడు నష్టాన్ని నివారించవచ్చని యశోదా మలక్‌పేట్ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనివాస్ బోట్ల న్యూరో సర్జన్ , వాసుకిరణ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రకాష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత



**అలంపూర్, ఆగస్టు 13 అక్షిత న్యూస్:** అలంపూర్ పట్టణానికి చెందిన అబెడ బాను ఆపరేషన్ నిమిత్తం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీ కాపీని గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే విజయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారం

### ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** నిరుపేద కుటుంబాల సొంతింటి కల సాకారం అయిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తిచేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులను ఆశీర్వదించి, వారికి నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ రాజ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, వారు గౌరవంగా జీవించేందుకు సొంత గూడు కల్పిస్తున్నామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై నూతన గృహాల్లోకి అడుగుపెడుతున్న లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో, ఇబ్బందులతో జీవించాల్సి వచ్చిందని తెలిపారు. గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని హామీలు ఇచ్చినప్పటికీ తమ సమస్యలను పట్టించుకోలేదని, సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా తమకు సొంత ఇల్లు మంజూరు కావడంతో తమ సొంతింటి కల నెరవేరిందని లబ్ధిదారులు తెలిపారు. తమ కుటుంబాలకు సొంత గూడు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి, తమ సమస్యను పట్టించుకుని సహకరించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇంట్లో గృహప్రవేశం చేసిన లబ్ధిదారులు పుట్టమాని రజిత బాలరాజ్, శెట్టి జ్యోతి బస్వరాజ్, ఎం. సుజాత యాదయ్య, చిన్నగుంట రామేశ్వరమ్మ ఆంజనేయులు, బుడగ జంగం కృష్ణవేణి సీతారాములు, అమ్మపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ద్వారా ఐదుగురు కుటుంబాలకు సొంతింటి కల సాకారం కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం, ఆత్మగౌరవంతో కూడిన జీవనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందని వారు పేర్కొన్నారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు.. ఒక కుటుంబానికి భరోసా, ఆత్మగౌరవం, భవిష్యత్తుకు పునాది. ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం" అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాధవి వెంకటేశ్వర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు క్యామ నవనీత రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, పెద్దమందడి మండలాధ్యక్షుడు వెంకటస్వామి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐ. సత్యరెడ్డి, గట్టు యాదవ్, శ్రీనివాసులు, బాలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు కుట్రను అడ్డుకోవాలి

### జిఆర్ఎంబి ఎజెండా నుంచి అంశాన్ని వెంటనే తొలగించాలి

### కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు 18వ సమావేశం ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జిఆర్ఎంబి సమావేశం ఎజెండాలో చేర్చడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని వినోద్‌కుమార్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రాజెక్టులకు సాధించిన చట్టబద్ధమైన అనుమతులను రద్దు చేయాలని కోరడం, ఆ అంశాన్ని జిఆర్ఎంబి ఎజెండాలో చేర్చడం పూర్తిగా సరికాదన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే తెలంగాణ రైతాంగం, సాగునీటి రంగం, రాష్ట్ర భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

తెలంగాణకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఈ అంశంపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు ప్రతిపాదనలు వస్తున్న సమయంలో రాష్ట్ర ఎంపీలు మౌనం వహించడం బాధాకరమన్నారు. తెలంగాణ ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి, తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని జిఆర్ఎంబి ఎజెండా నుంచి తొలగించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా ఈ అంశంపై తెలంగాణ తరఫున గట్టిగా పోరాడాలని కోరారు.

జిఆర్ఎంబి సమావేశాన్ని బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించాలని కోరుతోందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వినోద్‌కుమార్ విమర్శించారు. జిఆర్ ఎంబి సమావేశాన్ని బహిష్కరించాలన్నది బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ కాదని, తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని మాత్రమే సమావేశం ఎజెండా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేయకుండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఒకవేళ తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేస్తే రాష్ట్రంలో తీవ్ర విపత్కర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని వినోద్‌కుమార్ హెచ్చరించారు. ఈ నెల 18వ తేదీలోగా తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల పునఃపరిశీలన, రద్దుకు సంబంధించిన ప్రతిపాదనలను ఉపసంహరించడం తో పాటు, తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని జీఆర్ఎంబి సమావేశం ఎజెండా నుంచి తక్షణమే తొలగించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశం లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య , గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ కృష్ణ హరి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచ్ నర్సింహులు, సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి , కిషన్, జక్కుల నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బంది శారీరక, మానసిక దృఢత్వానికి

# క్రీడలు ఎంతో అవసరం

**రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభించిన కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు విధుల్లో మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా పనిచేసేందుకు క్రీడలను పోలీస్ అధికారులు బిజీగా ఒక భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అధికారులు, సిబ్బంది కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ప్రారంభించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌తో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించేందుకు సుమారు రూ. 8 లక్షల నిధులతో ఈ ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేశారు.

ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభించిన అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ఉంటారని, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో సేవలందించడం వంటి బాధ్యతలను నిర్వర్తించే క్రమంలో తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటారని ఇలాంటి పరిస్థితుల్లో క్రీడలు వారికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ప్రతి ఉద్యోగికీ క్రీడలు అవసరమే అయినప్పటికీ పోలీసు సిబ్బందికి వాటి అవసరం





మరింత ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, ఏకాగ్రత, చురుకుదనం పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గుతుందని,పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉంటే విధి నిర్వహణలో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలరని అన్నారు.

పోలీసు సిబ్బందికి మెరుగైన క్రీడా వసతులు కల్పించేందుకు రూ. 8 లక్షల నిధులతో ఇండోర్ షటిల్ కోర్టును జిల్లా ఎస్పీ ప్రత్యేక కృషితో ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ఈ సదుపాయాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

ముఖ్యంగా పోలీస్ అధికారులు ఫిట్నెస్ తో ఉంటేనే ఉద్యోగ నిర్వహణ శారీరక మానసిక ఆనందం కలుగుతుందని ప్రతి ఒక్కరు విధిగా శారీరక మానసిక దృఢత్వం కోసం క్రీడల్లో పాల్గొనాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు.

జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్ మాట్లాడుతూ......, పోలీసు ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను దృష్టిలో ఉంచుకుని ఇండోర్ షటిల్ కోర్టు ఏర్పాటుకు సహకరించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, రెవెన్యూ అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం ప్రజా సేవలో ఉంటారని, అనేక సందర్భాల్లో రాత్రింబవళ్లు విధులు నిర్వహించాల్సి వస్తుందని ఎస్పీ తెలిపారు. ఇటువంటి పని ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల ద్వారా శారీరక ఫిట్‌నెస్‌ను పెంపొందించుకోవడంతో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చుని,

పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తూ శాఖాపరంగా అందుబాటులో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యకరమైన శరీరం, ప్రశాంతమైన మనస్సు ఉన్నప్పుడే విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించగలమని అన్నారు.

కలెక్టర్, ఎస్పీ, అధికారులు స్వయంగా షటిల్ ఆడి ఉత్సాహంగా పాల్గొన్నారు.

కోర్టు ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటీల్, అదనపు కలెక్టర్, అదనపు ఎస్పీ తదితర అధికారులు నూతన ఇండోర్ షటిల్ కోర్టులో స్వయంగా బ్యాడ్మింటన్ ఆడారు. కొద్దిసేపు అధికారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడంతో పోలీసు సిబ్బందిలోనూ ఉత్సాహాన్ని నెల కోల్పారు. అధికారులు స్వయంగా క్రీడా కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా పోలీసు సిబ్బందికి ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై మరింత అవగాహన కల్పించారు.

అంతకుముందు పోలీస్ క్రీడా మైదానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌కు పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ కలిసి నూతన ఇండోర్ షటిల్ కోర్టును పరిశీలించి, ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ ఆర్డీఓ అర్చన, నాగర్ కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు, నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ , సీఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశ నమూనాలో క్రిష్ణవేణి విద్యార్థులు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** ఈ నెల 15 న జరుగబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు గురువారం వినూత్నంగా తమ పాఠశాల ప్రాంగణంలో భారత దేశ నమూనాను ప్రదర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలలో భాగంగా విద్యార్థులచే వినూత్నంగా నిర్వహించిన భారత దేశ నమూనా ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. వినూత్నంగా ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె. మణి అభినందించారు.

## ముత్యాలమ్మ ఆలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రత్యేక పూజలు



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి :** తిరుమలగిరి మున్సిపాలిటీ 11వ వార్డు లోని ముత్యాలమ్మ అమ్మ వారి ఆలయంలో బోనాల పండుగ మహోత్సవం ఘనంగా జరిగింది. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ గోవిందమ్మ రవీందర్ గారు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఆ జగన్మాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుకున్నట్లు తెలిపారు. మన ప్రాంతం ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎల్సోజు దీన దయాల్, ఉప్పలయ్య, మరోజు ఈశ్వర చారి, బెతోజు భాస్కర్, ఎల్సోజు భాస్కర్, శ్రీనివాస్, నాని, నవీన్, శ్రీకాంత్, చంటి, యాకయ్య, ఎమోజు మధు, శ్రీనివాస్, సంతోష్, వెంకటేష్, తరుణ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బద్రి నారాయణ బార్విల్ జయంతి సందర్భంగా స్కూల్లో నోటుబుక్స్ పంపిణీ




**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలము తోటపల్లి గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్లో మహికో కంపెనీ అధినేత బద్రి నారాయణ బార్వెల్ 95వ జయంతి సందర్భంగా జడ్పిహెచ్ఎస్ స్కూల్లో 10వ తరగతి, 8వ తరగతి, 9వ తరగతి, విద్యార్థులకునోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది మహికో కంపెనీ అధినేత జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో స్కూళ్లలో నోట్ బుక్స్ పంపిణీ చేయడం జరిగింది,తోటపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం రాధిక మాట్లాడుతూ మహికో కంపెనీ అధినేత బద్రి నారాయణ బార్విల్ జయంతి సందర్భంగా మా స్కూల్ కి నోట్ బుక్స్ పంపిణీ చేసినందుకు మహికో కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు,ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోగు రమణమ్మ సత్యనారాయణ. మాజీ ఎంపిటిసి డీలర్ రవీందర్ రెడ్డి.డీలర్ ఎస్సాజ్ పాషా.మహికో,టీబీమ్,వినయ్,స్కూల్ పిటి పురం చంద్,టీచర్స్ శ్రీనివాసులు గౌడ్,విష్ణుమూర్తి మహికో కంపెనీ ఏరియా ఇన్చార్జి ఎముక రవి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

# రాజ్యాంగ హక్కులను రక్షించుకుందాం

**సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు**

**చిలుకూరు ఆగస్టు13 (అక్షిత న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటిన చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 14 వరకు జరుగు పాదయాత్రలు,ప్రజా చైతన్య యాత్రలలో భాగంగా చిలుకూరు మండల పార్టీ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు,సహాయ కార్యదర్శి ఎస్ కె సాహెబ్ అలీ నాయకత్వాన పాత చిలుకూరు సిపిఐ పార్టీ కార్యాలయం నుండి మోటార్ సైకిళ్ళతో ప్రజా చైతన్య యాత్రను పార్టీజెండా ఊపి ప్రారంభించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతు దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని గుర్తు చేస్తూ కేంద్రంలో బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ వ్యవసాయ రంగాన్ని రైతులను హరించి వేసే విదేశీ విధాన స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం తక్షణం రద్దు చేయాలని కార్మిక హక్కులను



హరించి వేసే నాలుగు లేబర్ కోడులు రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించి 200 రోజులకు పని దినాలు పొడిగించి 700 రూపాయల కూలి పెంచాలని, ఈ పథకానికి బడ్జెట్లో కావాల్సిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.విద్య, వైద్యం ఉచితంగా అందించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని ప్రజలు ఎంతో నమ్మకంతో సంక్షేమ పథకాలు తమకు వస్తాయని ఎదురుచూస్తున్నారని ఆ నమ్మకాన్ని ఒమ్ము చేయవద్దని లేని పక్షంలో ప్రజా ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు ఈ ప్రజా చైతన్య యాత్ర చిలుకూరు దూదియా తండా శీతల తండా, నారాయణపురం, సీతారామపురం,సుబ్బోరి గూడెం,బేతవోలు గ్రామాలు తిరిగి జెర్రిపోతుల గూడెం గ్రామంలో ముగించడమైనది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నంద్యాల రామిరెడ్డి,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చేపూరి కొండలు, వ్యవసాయ కార్యదర్శి సంఘం జిల్లా అధ్యక్షులు రెమిడాల రాజు ,బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య,పార్టీ శాఖ కార్యదర్శులు చిలువేరు ఆంజనేయులు,తాళ్లూరు వెంకటయ్య,బెజవాడ వినోద్, కందుకూరి శ్రీను,మండల నాయకులు దొడ్డ నాగేశ్వరరావు, కస్తూరి సైదులు,తాళ్లూరి రామారావు,నేలపట్ల జనార్ధన్, కీసర కొండలు,కొడారు శీను, బాలే బోయిన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో రైతుల అవస్థలు

**సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి**

**నాణ్యమైన 24 గంటల కరెంటును ఇవ్వాలని రైతులు ఆందోళన**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కరెంటు కోతలతో రైతులు అవస్థలు పడుతున్నారని సర్పంచ్ తలసాని కృష్ణారెడ్డి అన్నారు బుధవారం కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామ సబ్ స్టేషన్ ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని అన్నారు. 24 గంటల కరెంటును 12 గంటలకు కుదించారు. వెంటనే రైతులు యధావిధిగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిజాముద్దీన్ మాజీ ఉపసర్పంచ్ మదన్మోహన్రావు, వార్డు సభ్యులు కిషోర్,రైతులు మల్లారెడ్డి రవి గొడుగు శేఖర్ ఐలయ్య సుల్తాన్ ప్రవీణ్ రెడ్డి రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన ఉండాలి

**కరస్పాండెంట్ కరుణ దేవి రెడ్డి**







**రంగారెడ్డి అక్షితబ్యూరో:** విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన ఉండాలని, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని ఈటెన్ టెంపుల్ హై స్కూల్, స్ప్రింగ్ వుడ్ స్కూల్ కరస్పాండెంట్ కరుణా దేవి రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో స్టూడెంట్ అకాడమిక్ యా క్టివిటిలో భాగంగా స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కెప్టెన్, వైస్ కెప్టెన్ ప్రజా పద్ధతిలో ఎన్నికల నిర్వహణ కోసం విద్యార్థులకు ఓటు హక్కు కల్పించారు. అమ్మాయిలు, అబ్బాయిలు కెప్టెన్‌లు పో టీలో నిలబడ్డారు. పోలింగ్ ఆఫీసర్, బూత్ ఏజెంట్లను మైక్రో అభ్యర్థులను ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో విద్యా ర్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యార్థి దశ నుంచే ఎన్ని కలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో ప్రజా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని స్కూల్ కరస్పాండెంట్ కరుణదేవి రెడ్డి తెలిపారు. అమ్మాయిని తరఫునుండి బి సాయి కీర్తన, అబ్బాయిల తరఫునుండి ఈ విశేష్ ఆనంద్ కెప్టెన్లుగా, ప్రధాన కార్యదర్శిగా ఏ. రితిక, స్పోర్ట్స్ కార్యదర్శులుగా ఎస్. రోనాక్, హరి సంజన, సాంస్కృతిక కార్యదర్శులుగా జి ప్రణవి, పి ప్రణీత్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఎన్నికైన విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వి సత్య దేవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దయాకర్ రెడ్డిని కలిసిన ఎదులాపురం కౌన్సిలర్ దేవయ్య చారి

**పెన్షన్ల మంజూరుకు విజ్ఞప్తి**



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి ని 28వ వార్డు కాంగ్రెస్ నాయకుడు అక్కినేపల్లి దేవయ్య చారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల దేవయ్య చారి సీపీఐకి రాజీనామా చేసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా దేవయ్య చారి మాట్లాడుతూ 28వ వార్డులోని ఒంటరి మహిళలు వితంతు మహిళలు వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని తుంబూరి దయాకర్ రెడ్డి ని కోరినట్లు తెలిపారు. వార్డులోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని దయాకర్ రెడ్డి హామీ ఇచ్చినట్లు దేవయ్య చారి తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల అక్షితబ్యూరో:** గురువారం జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లోని ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆగష్టు 15 స్వాతంత్ర దినోత్సవానికి సంబంధించిన వేదిక నిర్మాణం, పతాకావిష్కరణ స్థలం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణం, స్టాల్స్, పార్కింగ్, భద్రతా చర్యలు వంటి అంశాలను ప్రత్యక్షంగా సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని





సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.

రెవెన్యూ, పోలీస్, డిఆర్ డి ఓ మరియు మున్సిపల్ సంబంధిత అధికారులతో సమన్వయం పెంచుతూ భద్రతా బందోబస్తును, ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సూచించారు.

ఆహ్వానితులకు, విద్యార్థులకు మరియు ప్రజలకు అవసరమైన నీటి సదుపాయాలు, వైద్య సిబ్బంది, శానిటేషన్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పతాకావిష్కరణ అనంతరం జరిగే అట్టహాసపూరిత పరేడ్, శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు.

విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతతో చేయాలని అన్నారు.

జిల్లా ప్రజలంతా స్వాతంత్ర దినోత్సవ దినోత్సవాన్ని గౌరవంగా, దేశభక్తి వాతావరణంలో జరుపుకోవాలని ఆహ్వానించారు.

ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్లు బి.ఎస్ లత, బి. రాజ గౌడ్, డిఆర్డిఏ రఘువరన్, డిపిఆర్వో శ్రీధర్, సంబంధిత జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.వో కిషన్, ఎమ్మార్వో రామ్మోహన్, రెవిన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, డిఆర్డిఎ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## 5వ డివిజన్ (ఏదిర)లో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి విస్తృత పర్యటన






**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ (ఏదిర) ప్రాంతంలో లిడిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి గురువారం రోజున విస్తృతంగా పర్యటించారు. డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించడంతో పాటు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా మరియు వీధి దీపాల నిర్వహణను డిప్యూటీ మేయర్ పర్యవేక్షించారు. నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి సూచించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయాలని, చెత్త సేకరణ క్రమబద్ధంగా జరగాలని స్పష్టం చేశారు. ఏదిర ప్రాంతవాసులతో మాట్లాడి, వారి సమస్యలు మరియు విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రతి సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నగరంలోని ప్రతి డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఏదిర (5వ డివిజన్) ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటు రాకుండా చర్యలు తీసుకుంటాం. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి అని డిప్యూటీ మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లలిత బాను చందర్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, స్థానిక నాయకులు, వార్డు ప్రతినిధులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## అవయవదానంతో మరొకరికి ప్రాణదానం

**ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం**

**అదనపు కలెక్టర్ వైవి గణేష్**




**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని అభ్యుదయ సేవా సమితి, సదాశయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రంగశాయిపేట ప్రధానోపాధ్యాయులు వి. రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ అదనపు కలెక్టర్ వై.వి. గణేష్ హాజరై అవయవ దానంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవయవ దానం అనేది అత్యంత గొప్ప మానవతా సేవ అని అన్నారు. ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసే అవయవాలు ఇతరులకు కొత్త జీవితాన్ని ప్రసాదించే అవకాశం ఉందని తెలిపారు. గుండె, కాలేయం, మూత్రపిండాలు వంటి అవయవాలు అవసరమైన వారికి లభిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. అవయవ దానంపై సమాజంలో ఉన్న అపోహలు, అనుమానాలను తొలగించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు టి. శ్రావణ్ కుమార్, బాలల సంక్షేమ కమిటీ మాజీ చైర్మన్ మండల పరషూరాములు మాట్లాడారు అవయవదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.